# GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

Founder & President



Apo. Rev. Dr. Livingston Gadde

# NEWS LETTER

Co - Founders



Dr. David Chigurupati



Rev. Dr. Joseph Paturi
Vice - President

For Private Circulation only

March - April 2020



**రెవ. ప్రియనాథ్ రూఫస్**
ఎక్సేక్యుటివ్ డిరెక్టర్, జీటీసీయెం

## ప్రభువైన యేసుక్రీస్తులో ప్రియులైన జీటీసీయెమ్మర్స్,

మన రక్షకుడును, ప్రియ ప్రభువునైన యేసుక్రీస్తు నామంలో మీకందరికీ నా శుభాలు. ప్రస్తుతం దేశంలోనూ, ప్రపంచమంతటనూ నెలకొన్న పరిస్థితిల్లో మనమందరం క్షేమం కలిగివుండడానికి తన అత్యధికమైన ప్రేమను చూపిస్తోన్న మన ప్రియమైన యేసుక్రీస్తుకు సహస్ర కోటి స్తోత్రాలు. మన నాయకులు పెద్ద వయసులోనున్నప్పటికీ వారి వారి ప్రదేశాల్లో ఆరోగ్యవంతులుగానున్నందుకు దేవునికి వందనాలు. ప్రార్థిస్తోన్న మీకందరికీ నా శుభాలూ, కృతజ్ఞతలూ తెలియజేస్తోన్నా.

**న్యూస్:** మార్చ్ ఏడో తేదీన జగ్గయ్యపేటలో రెవరెండ్ ఎం. సామ్యూల్ గారి ఎల్షడ చర్చ్‌లో రాత్రి ఉపవాసకూటానికి నేనూ, బ్రదర్ రాజశేఖర్, మన ఆఫీస్ అసిస్టెంట్ బ్రదర్ ప్రకాష్ వెళ్ళాం. మూడు వందలకంటే ఎక్కువమందే పాల్గొన్నారు. దేవునికి మహిమకరంగా ఈ కూడిక జరిగింది. దేవునికి స్తోత్రాలు. రెవరెండ్ సామ్యూల్ గార్కి అభినందనలు.

డబ్ల్యూటీసీయెస్ – జోహన్నస్‌బర్గ్ 2020 పోస్ట్‌పోన్ కావడం కొంత బాధగా ఉన్నప్పటికీ అన్నీ దేవుని చిత్తాన్ని బట్టే జరుగుతోన్నాయని విశ్వసించే మనకిది పెద్ద డిసప్పోయింట్‌మెంట్ మాత్రం కాదు.








ఎట్టకేలకు కరోనా (కోవిడ్ 19) పుణ్యమంటూ బిజీ బాబులంతా ఇళ్ళకు, కుటుంబాలకూ పరిమితమయ్యారు. ఇది మనకు సెబాటికల్ లీవ్ లాంటిది. అంతవరకు బానేవుంది. కానీ మనచుట్టూ వున్న ప్రపంచమే బాలేదు. కరోనా మహమ్మారి ప్రపంచ మనుగడకే చిచ్చుపెడుతుంది. పనులన్నీ ఆగిపోయాయి. ఇండస్ట్రీస్ మూతపడిపోయాయి. ఆఫీసులు క్లోజైపోయాయి. ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్స్ తలుపులు మూసుకొన్నాయి. ప్లే గ్రౌండ్‌లో సాయంత్రం ఆటలాడుకొనే పిల్లలు ఈసురోమంటూ ఇళ్ళనే అంటిపెట్టుకొని వున్నారు. సూక్ష్మంగా చెప్పాలంటే జనజీవన స్రవంతి స్తంభించిపోయింది. మేలుకొనివున్నదల్లా భారాన్ని మోస్తోన్న ఎమర్జెన్సీ సర్వీసులవారు మాత్రమే. మన కొరకు వాళ్ళు రిస్క్ తీసుకొంటున్నారు. వారి సేవలను కొనియాడక తప్పదు. ఈ కారణాలనుబట్టి ప్రపంచదేశాల ఎకానమీ కుచించుకు పోతోంది. ప్రజలకు ఏ విధంగానూ పనికిరాని నేతల పాలిటిక్స్‌కి ఇది చెక్ పెట్టింది. అది వెల్కమింగ్ ఈవెంటే! మనవరకూ చూస్తే, అంటే సామాన్య మానవుని విషయానికొస్తే – పన్నులాగిపోయాయి. చిరు ఉద్యోగులంతా ఠంచన్‌గా పన్నులుకట్టక తప్పదు. ఇది ప్రభుత్వాల ఎక్స్‌చెకర్‌కి పెద్దగా లాభపడదు. ఈ మధ్య లిక్కర్ షాప్స్ కూడా మూతపడినట్టున్నాయి. ప్రభుత్వ ఖజానా డీలాపడుతోన్నట్లే. ఏమైనా సగటు మానవునికి మేలుకరమైన ప్రభుత్వ ప్రయత్నాలను సంతోషంగా స్వాగతిద్దాం. పోతే రాబోయే నెలల్లో ఎవరికి జీతాలందుతాయో, ఎవరు రోడ్డున పడతారో ఎవరికీ తెలియదు. పెద్ద కష్టమే వచ్చింది మరి.

జనతా కర్ఫ్యూ నుండి ఇప్పటికి పది రోజులు గడచిపోయాయి. పది దినాల గృహనిర్బంధం చాలా కఠినంగా అనిపిస్తుందనుకొంటాను. హౌస్ అరెస్ట్‌లో ఉండేవారు ఎలా వుంటారో, ఎంత బాధననుభవిస్తారో మనం కూడా కొంత గ్రహించ గలుగుతూన్నాం. ఆంగ్ సాన్ స్యూ కీ (Aung San Suukyi) మియాన్మార్‌లో 15 సంవత్సరాలపాటు గృహనిర్బంధంలో ఎలా ఉండగలిగిందో! ఇటీవలి కాలంలో జమ్ము & కాశ్మీర్ పొలిటికల్ లీడర్స్ గృహనిర్బంధంలో ఎలా గడిపారో! టీవీ, యూట్యూబ్, ఫేస్ బుక్, సెల్‌ఫోన్ ఫెసిలిటీస్ లేకుండా; కనీసం బయటి ప్రపంచాన్ని చూడడానికి బాల్కనీ కూడా లేకుండా, బయట వర్షం, ఉరుముల చప్పుడు, లోన జంతువుల అరుపులు తప్ప వేరే సౌండ్ వినకుండనోవాహు, తన కుటుంబం ఐదు నెలలపాటు వినూత్నమైన గృహనిర్బంధం (ఓడ)లో ఎలా గడిపారో!

కోవిడ్ 19 కఠినంగానే వ్యవహరిస్తోంది. ధనికులూ, దరిద్రులనీ, పండితులూ, పామరులనీ, పాలకులూ, పాలితులూనని, పిల్లలూ, పెద్దలూననీ వ్యత్యాసం చూపకుండా నిష్పక్షపాతంగా తనపని చేసుకుపోతోంది. సంపన్న దేశాలు కూడా దీనికి సలాం కొడుతోన్నాయి. దేశాలను గడగడలాడిస్తోంది. ఇట్టి దౌర్భాగ్యాన్ని మన జెనరేషన్లో చూడడం మన దురదృష్టం. పుకార్లను ఖాతరు చేయకుండా, ఈ మహమ్మారిని చూచి భయపడనిది నీవూ, నేనేననుకొంటా! మన ధీమా ఏవిటంటే – 1. మనం ప్రభువు చేతుల్లో ఉన్నామనీ, 2. మనకేది శ్రేయస్కరమో మన ప్రభువే నిర్ణయిస్తాడనీ, 3. ఆయన ఏమి చేసినా అదే మనకు మేలుకరమైనదనే నిజ క్రైస్తవ విశ్వాసం. ఇశ్రాయేలీయులు బబులోను చెరలోనే వున్నారు. పుట్టెడు దు:ఖంతో విలపిస్తూ వున్నారు. అయినా వారినిమిత్తమైన దేవుని మాటలిలావున్నాయి: "నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవుకాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కాదు." యిర్మియా 29:11. ఒకవేళ ఎవరైనా ఈ ధైర్యం లేక పోయివుంటే వారు విశ్వాసంలో బలపడవలసిన అవసరం వుందని గమనించి, తగినంత విశ్వాసం కొరకు దేవుని వేడుకోవాలి. అపోస్తలులు – "మా విశ్వాసము వృద్ధిపొందించుమని ప్రభువుతో చెప్పగా" లూకా 17:5.

మనలో కొంతమంది ఉద్యోగ బాధ్యతల నిమిత్తం రోజూ ఆఫీసులకు వెళ్తూనే వున్నారు. ఉదయం 6 నుండి 9 వరకు బజారుకు వెళ్లేవారు వెళ్తూనే వున్నారు. మన సహోదరీల సంగతేమిటి? బయటకు పోని నీలాంటి నాలాంటివారి సంగతేమిటి? కష్టంగావుంటే, ఇబ్బందిగావుంటే అది కేవలం మనం మన సమయాన్ని గడిపే విధానంలో కొంత మార్పు చేసుకొంటే సరిపోతుందేమో.

## మీ సమయం సంతృప్తికరంగా గడవాలంటే ఏం చేయాలి?

1. మీ పిల్లలతో హాయిగా గడపొచ్చు.
2. మంచి వంటకాలు చేసుకొని ఫేమిలీ అంతా కలిసి ఎంజోయ్ చేయొచ్చు.
3. మంచి పుస్తకాలు చదవడానికిది ఎంతో సదవకాశం. మనలో చాలామంది మంచి పుస్తకాలు కొనుక్కొని వాటిని ఎప్పుడూ విప్పకుండా దాచుకొంటారు. ఇప్పుడిక వాటిని తెరవవచ్చు.
4. ఫేమిలీ ప్రేయర్కిది మంచి అవకాశం. రోజుకు మూడుసార్లు ఫేమిలీ అంతా కూచొని హాయిగా పాటలు పాడుకొని, తండ్రిగాని, తల్లిగాని వాక్యాన్ని పిల్లలతో చదివించి, దాన్ని చక్కగా విపులీకరించి, అందరూ దాన్ని అర్థం చేసుకొనేలా బోధించి, అందరూ, అంటే ఒకరి తర్వాత ఒకరు ప్రార్థించి ప్రభువుతో గడపడానికిది మంచి అవకాశం. కీర్తనల గ్రంథం, సామెతల గ్రంథం, యోహాను సువార్త, రోమీయులకు రాసిన పత్రిక, యోహాను మొదటి పత్రిక మొదలైనవి ఉపయోగించుకోవచ్చు. ఎస్తేరు, యోబు గ్రంథాలు కూడా. 30 నిమిషాలనుండి 60 నిమిషాలవరకూ ఇలా గడపొచ్చు. ఈ వ్యాయామం మన ఆత్మలకు ఆశీర్వాదకరంగా వుంటుంది.
5. అనేకుల కొరకు (మీతో పనిచేసే వారి కొరకు), మీ పొరుగువారి రక్షణ కొరకు, కష్టాల్లో ఉన్నవారి కొరకు, మన మన సంఘస్థులందరి కొరకు, మన దేశం కొరకు, యావత్ప్రపంచం కొరకు ప్రార్థించవచ్చు. "నా పేరుపెట్టబడిన నా ప్రజలు తమ్ముతామే తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచినయెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును." (2 దినవృత్తాంతములు 7:14)
6. దుర్బుద్ధితో యిట్టి పరిస్థితిని సంక్రమింపజేసిన వారి పరివర్తన కొరకు కూడా ప్రార్థించొచ్చు.
7. విదేశాల్లో చిక్కుకుపోయిన మన ప్రియ బిడ్డల కొరకు ప్రార్థించొచ్చు.
8. వారికి వేక్సిన్ జరగకపోయినా మన కొరకు ఎమర్జెన్సీ సర్వీసెస్లోనున్న వారికొరకు, అనగా – డాక్టర్స్, నర్సెస్, తదితర మెడికల్ సిబ్బంధి, పోలీస్ శాఖ, నోడల్ సర్వీస్లోనున్న వారు, పారిశుధ్య పనివారు, వ్యాపారులు, బేంక్ స్టాఫ్, ట్రెజరీ శాఖ, అనేక విధాలుగా సహకరిస్తున్న రెవెన్యూ శాఖ, ఇన్స్యూరెన్స్ శాఖలు మొదలైనవారందరి కొరకూ ప్రార్థిద్దాం.
9. సంఘ కాపరులు, సంఘాల నాయకులు ప్రభుత్వం అమలుపరుస్తున్న విధానాలను ప్రోత్సహిస్తూ, జిల్లా, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాల కొరకూ, అధికారుల కొరకూ ప్రార్థిస్తూ, వారిని ప్రోత్సహించే విధమైన నిర్ణయాలు తీసుకొనేటట్లు ప్రార్థించండి.
10. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంతో సహకరించడం మన బాధ్యత; ప్రభుత్వం క్రైస్తవులకేదో అన్యాయం చేస్తోందనే ఆలోచనలను సమర్థించడానికిది సమయం కాదు.

11. అనుదిన బైబిల్ మెడిటేషన్స్ పుస్తకాలు వున్నా, ఉద్యోగ బాధ్యతల కంగారులో రోజూ వాక్య భాగాలను చదవలేకపోయినవారు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

12. భక్తుల చరిత్రలు చదివి జీవితంలో సగటు క్రైస్తవ్యాన్ని మించిన ఉన్నత క్రైస్తవ జీవితం వైపు ప్రభావితులు కావొచ్చు.

13. మన సంఘాలకు లైబ్రరీలుంటే దైవానుగ్రహమైన లైబ్రరీ వసతిని సద్వినియోగం చేసుకోవచ్చు.

14. మరీ మరీ ముఖ్యంగా రక్షణలేని పిల్లల కొరకు తలిదండ్రులూ, రక్షణను గూర్చి ఆలోచించే సమయంలేని తలిదండ్రుల రక్షణ కొరకు పిల్లలూ ప్రభువు పాదాలు పట్టుకోవచ్చు.

రాబోయే దినాల్లో పరిస్థితులు కఠినంగా కాదు, భయంకరంగా మారవచ్చు. రెండు నెలల తరువాత మన చుట్టూ ఉన్నవారిని, మనతో పనిచేసేవారిని, సన్నిహితులను, స్నేహితులను ఎంతమందిని చూస్తామో ఊహించలేని భయంకరమైన పరిస్థితి. విచ్చలవిడిగా పెంచుకొన్న మన పాపం, అనైతిక జీవన విధానం ప్రపంచాన్నింతవరకూ తెచ్చింది. ఇది ముమ్మాటికీ వికృతమానవ స్వార్థముయొక్క దుష్ఫలితమే!

ఈ పరిస్థితిని మనమెలా ఎదుర్కోవాలి? ఒకవేళ సంకుచిత భావాలతో సతమతమైపోతోన్నట్లైతే, మార్పులేని ప్రవర్తనతో ఎలా ఎదుర్కొంటాం?? "మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ 6:7). దేవుడు మనయెడల మరొక్కసారి కృప చూపాలంటే పరివర్తన చెందిన హృదయాలతో ఆయనను ఆశ్రయించడం తప్ప వేరే దిక్కులేదు. "దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు" (కీర్తన 51:17). ప్రభువు చెబుతున్నాడు: "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింథీ 6:2). అందుచేత ఈ దినాలు మన జీవితాల పరివర్తనకు పరలోకం ప్రత్యేకించిన దినాల్లా అంగీకరిద్దాం. ఊహించని అవకాశమిది. సద్వినియోగం చేసుకొని మేలు పొందుదాం! నీనెవె ప్రజలు దేవుని ప్రజలు కారు. కానీ వారియెడల కనికరము చూపిన మన ప్రభువు మన యెడల, మన పిల్లల యెడల ఎందుకు జాలిపడడు? "నూట ఇరువదివేలకంటె ఎక్కువై, కుడియెడమలు ఎరుగని జనమును, బహు పశువులను గల నీనెవె మహాపురము విషయములో నేను విచారపడవద్దా?" (యోనా 4:11) అన్న దేవుడు మన యెడలకూడా కనికరము చూపగల సమర్థుడు.

**నోట్:** సొదొమ గొమొర్రాల నాశనానికీ, తన సోదరుని కుమారుడైన లోతుకీ మధ్యన అడ్డుపడిన అబ్రహాములా ప్రపంచ పతనానికీ ప్రజలకూ మధ్యన ప్రభుని కృపకొరకు మనం ప్రాధేయపడవలసిన (అడ్డుపడాల్సిన) సమయమిది.

సంపన్న దేశాలూ, శక్తివంతమైన దేశాలూ అధికార గర్వంతో ప్రపంచానంతటిని శాసించగలమనీ, శాసించడానికి తగినంత ఆయుధ సంపత్తి తమకుందనీ, జ్ఞానమంతా తమ సొంతమేనని భావించే దేశాలూ, నాయకులూ, అధికారులూ, శాస్త్రవేత్తలూ చిన్న సూక్ష్మజీవితో పోరాడలేకపోతున్నారు. అందుచేత మనుష్యజ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనమని, దేవుని మీద ఆధారపడటమే వివేకమని అధికారంలో వున్నవారూ, అసత్యంలో జీవించేవారు గ్రహించి దేవుని ఆశ్రయించాలని ప్రార్థిద్దాం.

భీతావహులైన మన ఇరుగుపొరుగు వారిని ధైర్యపరచాలి. వారికోసం ప్రార్థిస్తున్నామని చెప్పాలి. చేతనైనంత సహాయం చేయాలి. మన ఇరుగుపొరుగులలో చాలా మందికి 'మంచి సమరయుని కథ (ఉపమానం) తెలుసు. అది నిజ జీవితంలో ప్రూవ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రోడ్లమీద మనకొరకు కష్టపడుతోన్న మెడికల్ సిబ్బంధికీ, పోలీస్‌లకూ, పారిశుధ్యపనివారికీ మంచినీళ్ళ పేకెట్స్ సరఫరా చేసే కార్యక్రమం మొదలుకొని ఆహారం అందించే కార్యక్రమం వరకు ఏదైనా చేపట్టవచ్చు. మా సంఘంలో ఒక యంగ్‌మేన్ తమ గ్రామాలకు వెళ్ళలేక రాజమండ్రిలో చిక్కుకుపోయిన స్టూడెంట్స్‌కి ప్రతిపూటా ఆహారం సప్లై చేస్తూన్నాడు. దీన్నే మన పెద్దలు "మనసుంటే మార్గముంటుందని" చెబుతూ వుంటారు. మనం చేసే ప్రార్థనలు క్రియలకు సప్లిమెంట్స్ కాదు. అలానే మన క్రియలు ప్రార్థనలకు సప్లిమెంట్స్ కాదు. రెండూ కలిసి జరగాలి. చెప్పేవారంగా మాత్రమే కాకుండా చేసే వారమనే స్థాయికి ఎదగడానికి ప్రయత్నిద్దాం.

మీ క్షేమం కోరి నిత్యమూ ప్రభువును ఆశ్రయిస్తూ, దీవిస్తూ

మీ తోటి సేవకుడు

ప్రియనాథ్ రూఫస్

**గమనించండి:**

- ★ కావలసిన రేషన్ కనీసం రెండు నెలలకు సరిపడా తెచ్చివుంచుకోండి.
- ★ ముందుచూపు కలిగి ఇంటిలో తెచ్చిపెట్టుకొన్న గ్రోసరీని దుబారాగా ఖర్చు చేసుకోవద్దు.
- ★ అనవసరంగా బయటకు వెళ్ళొద్దు.
- ★ పాలపేకెట్స్ పట్టుకొన్నవారు ఆ పేకెట్స్‌నీ, మీ చేతుల్నీ శుభ్రంగా కుళాయి క్రింద సోపుతో కడగండి.
- ★ ఏది ముట్టుకొన్నా వెంటనే చేతులు శుభ్రంగా సోపుతో కడుగుకోండి.
- ★ కాయగూరల్ని ఉప్పు నీటిలో కడగండి.
- ★ వృద్ధులు, పిల్లల్ని గూర్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.
- ★ దేవుని చిత్తమైతే ఆదివార ఆరాధన ఆన్లైన్‌లో జరుపుకోండి.
- ★ అందర్నీ ఫోన్‌చేసి పలకరించుకోండి.
- ★ ఫోన్స్‌లో ఒకరికొరకొకరు ప్రార్థించుకోవచ్చు.
- ★ పనివాళ్ళను ప్రస్తుతానికి మాన్పించండి.
- ★ ఎవరైనా అక్కరలోనున్నారేమో ఫోన్ చేసి కనుక్కోండి.
- ★ అక్కరలోనున్నవారికి సాధ్యమైనంతవరకూ సహాయం చేయండి.
- ★ ఎవ్వర్నీ ఇంటిలో ఊరకనే ఎంటర్టైయిన్ చేయొద్దు.
- ★ అత్యవసర వస్తువులు సేకరించుకోడానికి ప్రభుత్వం సమయం ఇచ్చింది కదా అని పనిలేకపోయినా ఊరకనే తిరగకండి.
- ★ సోషల్ డిస్టేన్సింగ్ సక్రమంగా పాటిస్తే భయపడవలసిన పని లేదు.
- ★ ఫేమిలీ అంతా కలిసి ఆనందంగా గడపగలిగితే బోర్ కొట్టాల్సిన పని ఉండదు.
- ★ ఆన్లైన్ లైవ్ ఆరాధనలు జరుపుకోవచ్చు. మా సంఘంలో ఎవరికివారే మందిరానికి వెళ్తోన్నట్లే సిద్ధపడి వారి వారి గృహాల్లో కూచొని ఆరాధనలో పాల్గోంటున్నారు. అందర్నీ అందరూ చూసుకొంటూ ఆరాధన జరుపుకొంటూన్నాం. మందిరంలో నేను నిలవబడి ఎవర్ని ప్రార్థించమంటే వారు వారి గృహంలో నుండి ప్రార్థిస్తోన్నారు. వాక్యం చదవవలసిన వారు వాక్యం చదువుతోన్నారు. అందరూ కలిసి పాటలు పాడుతోన్నారు. సందేశం వింటోన్నారు. మా సంఘంలో గృహాలన్నీ మందిరాల్లా మార్పుచెంది విశ్వాసుల్ని సంతోషింపజేస్తోన్నాయి. అందరం ఇలా ఆరాధనలు జరుపుకొంటే సహవాసానందం సంతృప్తికరంగా వుంటుందనుకొంటున్నాను.
- ★ ప్రార్థనావసరతలుంటే వెంటనే మీ మీ దైవ సేవకులకు ఫోన్ చేయండి.

**స్పెషల్ నోట్:** ఆయా దేశాల్లోనున్న మన జీటీసీయెమ్మర్స్ కొరకూ, తెలుగు క్రైస్తవులందరికొరకూ, కష్టాల్లోవున్న దేశాలకొరకూ ప్రార్థిద్దాం.

**గమనిక**

కోవిడ్ 19 సందర్భంగ

**వర్ల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్ – జోహన్నస్‌బర్గ్ 2020**

పోస్ట్పోన్ అయింది అని తెలియజేయడానికి చింతిస్తూన్నాం. తిరిగి 2021 సంవత్సరం ఏప్రిల్ మాసం ఆఖరు వారంలో జరుగుతుంది.

వచ్చే నెలలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.

దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

**ప్రియనాథ్ రూఫస్,** ఎక్సేక్యుటివ్ డిరెక్టర్

ఫోన్ : 094949 08413, 098489 78222 ఈ మెయిల్ : rufus1410@gmail.com

జి.టి.సి.ఎం.అడ్రస్: సుధా లివింగ్‌స్టన్ ఛారిటబుల్ ట్రస్ట్ బిల్డింగ్, ఎం.బి.టి.యస్. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ దగ్గర, తురకపాలెం రోడ్, నల్లపాడు, గుంటూరు – 522 005

డిరెక్టర్ – ఆపరేషన్స్ : 098660 83001, ఆఫీస్ అసిస్టెంట్: 099087 87745. Website: www.gtcm.org

GTCM Telugus gtcmtelugus in/gtcmtelugus GTelugus GTCM Telugus